క్లుప్తంగా

ఆచారికి ఆరో'సారీ'

- మళ్లీ నిరాశే
- రెండో స్థానానికే పరిమితం


ఆచారి, బీజేపీ అభ్యర్థి

ఆమనగల్లు: కల్వకుర్తి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఆచారికి నిరాశే మిగిలింది. కల్వకుర్తి నుంచి ఆరోసారి పోటీ చేసిన ఆయనకు కలిసి రాలేదు. విజయం అంచుల దాకా వచ్చి వెనుతిరిగారు. వార్డు సభ్యుడిగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన.. జాతీయ స్థాయి నేతగా ఎదిగారు. 1996లో ఆమనగల్లు గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికై గ్రామాభివృద్ధికి కృషి చేశారు. బీజేపీలో మండల నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర కమిటీల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మూడు పర్యాయాలు పనిచేశారు. జాతీయ బీసీ కమిషన్ సభ్యుడిగా నియమితులై తనదైన శైలిలో పనిచేసి అందరి మన్ననలు అందుకున్నారు. కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 1994లో తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ చేసి 8,682 ఓట్లు సాధించారు. 2004లో 54వేల ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచారు. 2009లో 25 వేల ఓట్లు రాబట్టారు. 2014 ఎన్నికల్లో కేవలం 72 ఓట్ల తేడాతో ఓటమి చెందారు. 2018 ఎన్నికల్లో ఐదోసారి పోటీచేసిన ఆచారి.. 3వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో 5,410 ఓట్ల తేడాతో పరాజితులయ్యారు. విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. ఆయన విజయం ఖాయమని అందరూ భావించినప్పటికీ అదృష్టం కలిసిరాలేదు.

అధైర్యపడొద్దు

- గెలుపోటములు సహజం
- కేసీఆర్ నాయకత్వంలో పనిచేద్దాం
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఎన్నికల్లో గెలుపుపోటములు సహజమని, ఎవరూ అధైర్యపడొద్దని బీఆర్‌ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. శాసనసభ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం అహర్నిశలు పనిచేసిన నాయకులు, కార్యకర్తల చొరవ మరువలేమని ప్రశంసించారు. అందరి సమిష్టి కృషి వలన మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది, నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేశామని తెలిపారు. ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని గుర్తుచేశారు. అందరికీ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఎలాంటి ఆందోళనలు, ఆవేశాలకు గురికావొద్దని సూచించారు. ప్రజా తీర్పును స్వాగతిస్తున్నానని చెప్పారు. కార్యకర్తలు సమన్వయంతో పార్టీ కోసం కేసీఆర్ నాయకత్వంలో పని చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

ఓటర్ల తీర్పును గౌరవిస్తా..!

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజల తీర్పును శిరసావహిస్తామని, ఓటమికి కుంగిపోకుండా రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు దగ్గరవుతానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం తన నివాసంలో మాట్లాడుతూ.. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని రెట్టింపు ఉత్సాహంతో ప్రజలతో అన్ని వేళల్లో అందుబాటులో ఉంటానన్నారు. ఈ పోరాటంలో తన వెన్నంటి నడిచిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ శ్రేణులకు తాను ఎల్ల వేళలా అండగా ఉంటానని, ఏ ఆపద ఉన్నా తను ఉన్నాననే విషయాన్ని మర్చిపోవద్దని కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. తనకోసం పనిచేసిన ప్రతీ ఒక్కరిని మరిచిపోలేనన్నారు. ఈ ఓటమి భవిష్యత్తులో తన గెలుపునకు నాంది పలుకుతుందన్నారు.

డిపాజిట్ కోల్పోయిన ప్రధాన పార్టీల అభ్యర్థులు

రాజేంద్రనగర్: నియోజకవర్గ బరిలో నిలిచిన ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులు తమ డిపాజిట్లను కోల్పోయారు. మజ్లిస్, బీఎస్పీతో సహా ఇతర పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు తమ ధారవత్తును కోల్పోయారు. కేవలం బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు తప్పా... పోటీ చేసిన 22 మంది అభ్యర్థులు తమ డిపాజిట్లను కోల్పోయారు. మొత్తం 3,24,917 ఓట్లు పోలయ్యాయి. దీంట్లో 16 శాతం ఓట్లు వచ్చిన వారికే డిపాజిట్లు దక్కుతుంది. మజ్లిస్ పార్టీ, బీఎస్పీతో సహా స్వతంత్రులెవరికీ 16 శాతం ఓట్లు పోలు కాలేదు. వీరంతా డిపాజిట్లు కోల్పోయారు.

టీపీసీసీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో..

రంగారెడ్డి కోర్టులు: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మెజారిటీ రావడంతో రంగారెడ్డి జిల్లా కోర్టుల గేటు ముందు టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ రావుల చెన్నా రెడ్డి బాణసంచా కాల్చి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.


మీర్‌పేట్: విజయోత్సవాల్లో రాఘవేంద్రనగర్ బీఆర్‌ఎస్ శ్రేణులు


హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్‌లో విజయకేతనంతో బీఆర్‌ఎస్ నాయకులు

మహేశ్వరంలో గులాబీ బోణీ

- బీజేపీ అభ్యర్థి శ్రీరాములు యాదవ్‌పై 26,187 ఓట్ల మెజార్టీ
- మూడు స్థానంలో కాంగ్రెస్
- సంబరాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు
- 2009, 2018, 2023 ఎన్నికల్లో గెలుపు


కందుకూరు చౌరస్తాలో నినాదాలు చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

మహేశ్వరం: గత నెల రోజుల నుంచి హోరాహోరిగా సాగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరంలో పట్లోళ్ల సబితారెడ్డి మూడోసారి విజయం సాధించి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 26,187 ఓట్ల మెజార్టీతో సమీప బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్‌పైన విజయభేరి మోగించారు. నియోజకవర్గంలోని మహేశ్వరం, కందుకూరు, బాలాపూర్, సరూర్‌నగర్ మండలాలలో సబితారెడ్డి ఆధిక్యత కనబరిచారు. కొన్ని రౌండ్లలో అందెల శ్రీరాములు యాదవ్ పై చేయి సాధించారు. మొత్తం 5,46,577 ఓట్లకు 3,02,576 ఓట్లు పోలయ్యాయి. అందులో బీఆర్‌ఎస్ అభ్యర్థి సబితారెడ్డికి 1,25,578 ఓట్లు, బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్‌కి 99,391 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డికి 70,657, బీఎస్పీ అభ్యర్థి కొత్త మనోహర్‌రెడ్డికి 2,697 ఓట్లు పోలయ్యాయి. అందెల శ్రీరాములు యాదవ్‌పైన 26,187 ఓట్ల తేడాతో సబితారెడ్డి గెలుపొందారు. 2009, 2018, 2023 ఎన్నికల్లో మహేశ్వరం నుంచి వరుసగా గెలుపొంది విజయం సాధించారు. 2009లో టీడీపీ అభ్యర్థి తీగల కృష్ణారెడ్డిపైన 7,833 మెజార్టీ, 2018లో బీఆర్‌ఎస్ అభ్యర్థి తీగల కృష్ణారెడ్డిపైన 9,227 ఓట్ల మెజార్టీ, ఇప్పుడు బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్‌పై 26,320 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. కాంగ్రెస్ హవాలో మహేశ్వరంలో సబితారెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడం అందరిని ఆశ్చర్యానికి గురి చేసింది. తాను చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే భారీ మెజార్టీని ఇచ్చాయని ఆమె పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం మహేశ్వరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి సూరజ్ కుమార్ సబితారెడ్డికి ధ్రు వీకరణ పత్రాన్ని అందజేశారు. అనుచరులు, అభిమానులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సంబురాలు చేసుకున్నారు.

బీఆర్‌ఎస్ శ్రేణుల విజయోత్సవాలు

మీర్‌పేట: మహేశ్వరంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి సబితారెడ్డి గెలుపొందడంతో మీర్‌పేట కార్పొరేషన్‌లో బీఆర్‌ఎస్ శ్రేణులు భారీ ఎత్తున సంబరాలు చేశారు. జిల్లెలగూడ లలితానగర్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ మీర్‌పేట అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి ఆధ్వర్యంలో బాణసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. 16వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ అనిల్‌యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు బాణసంచా కాల్చి విజయోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు భూపాల్‌రెడ్డి, లావణ్య, నాయకులు రమేష్, నర్సింహారెడ్డి, రవిందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరం.. గులాబీమయం

బడంగ్‌పేట్: మహేశ్వరంలో ఎమ్మెల్యేగా సబితారెడ్డి విజయం సాధించడంతో బడంగ్‌పేట కార్పొరేషన్‌లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు సంబురాలు చేసుకున్నారు. కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్, మల్లాపూర్, వెంకటాపూర్, అల్మాస్‌గూడ, నాదర్‌గుల్, బడంగ్‌పేట్, కుర్మల్‌గూడ, మామిడిపల్లి తదితర ప్రాంతాల్లో నాయకులు, కార్యకర్తలు రోడ్లపై వచ్చి 'జై సబితమ్మ' అంటూ నినాదాలు చేస్తూ బాణసంచా కాల్చి విజయోత్సవాలు నిర్వహించారు.

కందుకూరులో..

కందుకూరు: మహేశ్వరంలో ఎమ్మెల్యేగా సబితారెడ్డి విజయం సాధించడంతో ఆదివారం సాయంత్రం బీఆర్‌ఎస్ నాయకులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రకాష్‌రెడ్డి, కార్తీక్, దీక్షిత్‌రెడ్డి, రామకృష్ణ, సురేందర్‌రెడ్డి, అంజిరెడ్డి, కృష్ణ, నారాయణరెడ్డి, బుగ్గ రాములు తదితరులు పాల్గొన్నారు.

సరూర్‌నగర్‌లో..

హుడాకాంప్లెక్స్: మహేశ్వరంలో ఎమ్మెల్యేగా బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి సబితారెడ్డి విజయం సాధించారు. మంగళవారం ఎన్నికల ఫలితాలు రావడంతో సరూర్‌నగర్ డివిజన్‌లో పండుగ వాతావరణం నెలకొంది. డివిజన్ అధ్యక్షుడు బోయిని మహేందర్ యాదవ్, మాజీ అధ్యక్షులు ఇంటూరి అంకిరెడ్డి, మాజీ కార్పొరేటర్ అనిత దయాకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సరూర్‌నగర్ చౌడీ సర్కిల్ వద్ద బాణసంచా పేలుస్తూ, స్వీట్లు పంచుతూ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో బాలకిషన్, కొండల్‌రెడ్డి, సుదర్శన్, నాగమణి, సాలమ్మ, భాగ్యలక్ష్మి, ఉషా, సరస్వతమ్మ, అమరావతి, ఇస్మాయిల్, జహీర్, రజాక్, బాలరాజుగౌడ్ తదితరులు ఉన్నారు.

కందుకూరులో బీఆర్‌ఎస్ లీడ్

కందుకూరు: మహేశ్వరం నియోజకవర్గంలో కందుకూరు మండలంలోని 35 గ్రామాల్లోని 61 పోలింగ్ బూత్‌ల్లో (451 నుంచి 511 పోలింగ్ బూత్‌లు) నమోదైన ప్రధాన పార్టీలకు సంబంధించిన ఎన్నికల ఫలితాలు ఇలా ఉన్నాయి.కాగా బీజేపీ 12,373 ఓట్లు, బీఆర్‌ఎస్ 14,570 ఓట్లు, కాంగ్రెస్‌కు 12,991 ఓట్లు పోలైయ్యాయి. 1579 ఓట్లతో బీఆర్‌ఎస్ కందుకూరు మండలంలో ఆధిక్యత కనబర్చింది.

గ్రామం పేరు	బీజేపీ	బీఆర్‌ఎస్	కాంగ్రెస్	ఆధిక్యం
చిప్పలపల్లి	422	354	183	బీజేపీ
మురళీనగర్	216	231	245	కాంగ్రెస్
ధన్నారం	324	296	219	బీజేపీ
పులిమామిడి	453	404	377	బీజేపీ
దావూద్‌గూడ	173	453	133	బీఆర్‌ఎస్
బాచుపల్లి	151	381	433	కాంగ్రెస్
నేదునూరు	762	1474	1172	బీఆర్‌ఎస్
దాసర్లపల్లి	292	545	548	కాంగ్రెస్
ముచ్చర్ల	406	463	390	బీఆర్‌ఎస్
ఊట్లపల్లి	275	241	148	బీజేపీ
సార్లరావులపల్లి	89	333	322	బీఆర్‌ఎస్
సాయిరెడ్డిగూడ	170	256	310	కాంగ్రెస్
కొత్తగూడ	434	502	268	బీఆర్‌ఎస్
జైత్వారం	333	316	421	కాంగ్రెస్
కొత్తూర్	402	400	288	బీజేపీ
గూడూరు	711	575	329	బీజేపీ
కందుకూరు	468	939	1128	కాంగ్రెస్
దెబ్బడగూడ	651	539	713	కాంగ్రెస్
తిమ్మాయిపల్లి	131	270	290	కాంగ్రెస్
మీర్‌ఖాన్‌పేట	275	600	569	బీఆర్‌ఎస్
బేగరికంచె	86	177	217	కాంగ్రెస్
ఆకులమైలారం	795	634	714	బీజేపీ
గుమ్మడవెల్లి	640	493	531	బీజేపీ
కొలన్‌గూడ	132	123	189	కాంగ్రెస్
మాదాపూర్	296	222	395	కాంగ్రెస్
తిమ్మాపూర్	1085	936	216	బీజేపీ
జబ్బార్‌గూడ	155	91	93	బీజేపీ
బేగంపేట	474	496	329	బీఆర్‌ఎస్
రాచులూరు	494	350	511	కాంగ్రెస్
కటికపలి	158	102	105	బీజేపీ
లేమూరు	581	1000	917	బీఆర్‌ఎస్
అగర్‌మియాగూడ	186	179	137	బీజేపీ
సరస్వతిగూడ	153	195	151	బీఆర్‌ఎస్

ప్రజల మధ్యే ఉంటా

- కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి
- ఓడిపోయానని అధైర్య పడవద్దు



మహేశ్వరం: ఎన్నికల్లో ఓడిన మహేశ్వరం నియోజకవర్గ ప్రజల మధ్యనే ఉండి సేవ చేస్తానని కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆదివారం పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. తనకు ఓటు వేసిన కార్యకర్తలు, ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమన్నారు. ఎన్నికల్లో అతి తక్కువ సమయంలో చాలా మంది మద్దతుగా నిలవడం ఆనందకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని నేరవేర్చేలా బాధ్యత తీసుకుంటానన్నారు. పదవులతో సంబంధం లేకుండా మహేశ్వరం నియోజకవర్గ ప్రజల సంక్షేమం, ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటానని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తాను ఓడిపోయానని అధైర్యపడవద్దని సూచించారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని పేర్కొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల విజయోత్సవాలు

తుక్కుగూడ: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడానికి స్పష్టమైన మెజారిటీ రావడంతో ఆపార్టీ నాయకుల సంబరాలు మిన్నంటాయి. తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ కార్యదర్శి గోగికర్ జానకీరామ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చంద్రశేఖర్ రెడ్డి, జంపన్న, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హస్తం హుషారు

కందుకూరు: రాష్ట్రంలో కాంగ్రెస్‌కు స్పష్టమైన మెజార్టీ రావడంతో ఆదివారం సాయంత్రం ఆ పార్టీ శ్రేణులు స్వీట్లు పంచుకుని సంబురాలు చేసుకున్నారు. జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్ ఆధ్వర్యంలో కార్యకర్తలు టపాసులు కాల్చి సంబురాలు జరుపుకొన్నారు.


మహేశ్వరం: ఉప్పుగడ్డ తండాలో కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు


మహేశ్వరం: కోళ్లపడకల్‌లో కాంగ్రెస్ కార్యకర్తల ఉత్సాహం


తుక్కుగూడలో నినాదాలు చేస్తున్న హస్తం పార్టీ నాయకులు


కందుకూరులో స్వీట్లు పంచుకుంటున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

నిమిషాల్లో నూర్పిడి..!

- వరికోత యంత్రాలతో మేలు
- రైతులకు మిగులుతున్న కూలి
- అద్దెకు కోత మిషన్లు


వరికోస్తున్న యంత్రం

షాబాద్: గతంలో వ్యవసాయం చేయాలంటే ఎంతో వ్యయ, ప్రయాసాలనొర్చి చేయాల్సి ఉండేది. ఎద్దులతో అరక చేత పట్టి పొద్దస్తమానం దున్నేవారు. విత్తనం వేసింది మొదలు పంట ఇంటికి చేరేదాక కూలీల అవసరం ఉంటుంది. ప్రస్తుతం వ్యవసాయంలో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. యంత్ర పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. చిన్న మడి దున్నినా ట్రాక్టర్‌తో దున్నుతున్నారు. విత్తనం కూడా ట్రాక్టర్‌తోనే వేస్తూ వ్యవసాయంలో ప్రతీ పనికి యంత్రాలను విరివిగా వాడుతున్నారు. క్రమక్రమంగా వ్యవసాయరంగంలో కొత్తపద్ధతులను తీసుకొచ్చి రైతులు దూసుకపోతున్నారు. అందుకే ఒక్కో రైతు ఎకరాల్లో పంటలను సాగు చేస్తున్నారు. ఇప్పటివరకు వరి పంటను కూలీలతో కోయించి, నూర్పిడి కోసం యంత్రాన్ని వాడేవారు. ప్రస్తుతం వరికోత యంత్రాలతోనే వరిపంటను పొలంలోనే నూర్పిడి చేయిస్తున్నారు. ఈ విధానంతో రైతు ఒకేసారి ధాన్యం సంచులు నింపుకునే ఆస్కారం కలుగుతుంది. యంత్రవినియోగానికి గంటకు రూ. 2,200 అద్దె తీసుకుంటున్నారు. గంట వ్యవధిలో ఎకరా పొలంలోని వరిపంటను ఆ యంత్రం నూర్పిడి చేస్తుంది. రైతులు అప్పులు చేసి సాగు చేసిన పంటలు చేతికొచ్చే సమయంలో కూలీల కొరతతో నేలపాలయ్యేవి. కాని ప్రస్తుతం యంత్రాలు రావడంతో అన్నదాతలకు కూలీల కొరతతో ఇబ్బందులు దూరమయ్యాయి. రైతు ఒక్కడు ఉంటే చాలు నిమిషాల్లో ధాన్యం ఇంటికి చేరుతుంది. షాబాద్ మండల కేంద్రంలో పది వరకు వరికోత యంత్రాలు అద్దెకు అందుబాటులో ఉన్నాయి.

నోటాకు 1,819 ఓట్లు

రాజేంద్రనగర్: నియోజకవర్గ పరిధిలోని దాదాపు 1819 ఓటర్లు నోటాకు ఓటు వేశారు. ఎన్నికల్లో పాల్గొన్న ఓటర్లు పెద్దసంఖ్యలో బరిలో నిలిచిన అభ్యర్థులను కాకుండా నోటాకు ఓటు వేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులు మొత్తం 25 మంది ఈ ఎన్నికల్లో పోటీ చేశారు. కానీ వారందరికి తమ ఓటు కాదని... నియోజకవర్గానికి చెందిన 1819 మంది ఓటర్లు నోటాకు ఓటు వేశారు. ఆదివారం ప్రకటించిన ఫలితాల్లో నోటాకు మొత్తం 1,819 ఓట్లు వచ్చాయి.



కమ్ముకున్న పొగమంచు!

షాబాద్ మండల కేంద్రంలో ఆదివారం ఉదయం పొగ మంచు కమ్మేసింది. ఉదయం 5గంటల నుంచి 8 గంటల వరకు మండలాన్ని పొగ కప్పేసింది. ఉదయం పూట రోడ్డుపై వెళ్తున్న వాహనాలు లైట్లు వేసుకుని వెళ్లాల్సి వచ్చింది. వాహనాల రాకపోకలకు కొంత ఇబ్బంది కలిగించింది. ఇలా పొగ మంచు గ్రామాలను కమ్ముకోవడంతో ఉదయమే చీకటిని తలపించింది.

– షాబాద్

'హస్తం' గుప్పిట్లో పట్నం

- కాంగ్రెస్‌కు పూర్వ వైభవం
- రికార్డు సృష్టించిన రంగారెడ్డి
- చిరకాల ప్రత్యర్థిపై విజయం
- విలక్షణ తీర్పు ఇచ్చిన ఓటర్లు


మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్యే (కాంగ్రెస్)


మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే(బీఆర్‌ఎస్)


లోయపల్లిలో సంబురాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ కార్యకర్తలు

ఇబ్రహీంపట్నం: విప్లవాల పురిటిగడ్డగా పేరుగాంచిన ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో విజయం కోసం నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ తహతహలాడింది. ఈ సుదీర్ఘ నిరీక్షణకు ఓటర్లు తెరదించారు. ఆదివారం వెలువడిన శాసనసభ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డికి ప్రజలు పట్టం కట్టారు. సమీప బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డిపై 40 వేల మెజార్టీతో విజయకేతనం ఎగురవేశారు. వరుసగా మూడుసార్లు గెలుపొందిన మంచిరెడ్డికి ఈ ఎన్నికల్లో రంగారెడ్డి చెక్ పెట్టారు.

కాంగ్రెస్‌కే పట్టం

హైదరాబాద్ నగరానికి అతిసమీపంలో ఉన్న ఇబ్రహీంపట్నం నియోజకవర్గం రాజకీయ చైతన్యం కలిగిన ప్రాంతం. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ఇక్కడి ప్రజలు చురుగ్గా పాల్గొన్నారు. ఇక రాజకీయ ప్రస్థానానికి వస్తే ఈ నియోజకవర్గం 'హస్తం' నుంచి చేజారి నాలుగు దశాబ్దాలు అవుతుంది. 1983లో టీడీపీ ఆవిర్భావం అనంతరం జరిగిన రాజకీయ పరిణామాలతో కాంగ్రెస్ పార్టీ గడ్డు రోజులు ఎదుర్కొంది. టీడీపీ, సీపీఎం పార్టీలు మూడు దశాబ్దాలుగా విజయం సాధించగా, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం 2018లో బీఆర్‌ఎస్ నియోజకవర్గంలో పాగా వేసింది. జిల్లాలోనే కమ్యూనిస్టుల ప్రాబల్యం అధికంగా ఉన్న నియోజకవర్గం. 1952లో హైదరాబాద్ రాష్ట్రం కింద ఈ నియోజకవర్గం ఉండేది. 2018 వరకు 16 సార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 8 సార్లు కాంగ్రెస్, 4 సార్లు టీడీపీ, మూడుసార్లు సీపీఎం, ఒకసారి టీఆర్‌ఎస్ విజయం సాధించింది. ఈ ఎన్నికల్లో హస్తం పార్టీకి ఓటర్లు పట్టం కట్టారు.

మల్‌రెడ్డి వర్సెస్ మంచిరెడ్డి

నియోజకవర్గంలో రంగారెడ్డి వర్సెస్ కిషన్‌రెడ్డి అన్నట్లుగా తలపడ్డారు. అయితే మూడు పర్యాయాలు పట్నంలో కిషన్‌రెడ్డి పాగా వేశారు. నాలుగోసారి జరిగిన ఎన్నికల్లో ఆయన తడపడ్డారు. ఇక 1994లో జరిగిన ఎన్నికల్లో మలక్‌పేట్ నుంచి టీడీపీ అభ్యర్థిగా రంగారెడ్డి గెలుపొందారు. 2004లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన ఆయన.. కిషన్‌రెడ్డి (టీడీపీ)పై విజయం సాధించారు. అప్పటి నుంచి వీరిద్దరూ నువ్వానేనా అన్నట్లుగా తలపడుతూనే ఉన్నారు. అయితే నియోజకవర్గ పునర్విభజన అనంతరం 2009లో జరిగిన ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం నుంచి టీడీపీ తరుపున మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి మల్‌రెడ్డి పోటీపడ్డారు. ఈ ఎన్నికల్లో కిషన్‌రెడ్డి గెలిచారు. రాష్ట్ర విభజన అనంతరం 2014 ఎన్నికల్లో టీడీపీ నుంచి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా మల్‌రెడ్డి రంగారెడ్డి సోదరుడు మల్‌రెడ్డి రాంరెడ్డి తలపడ్డారు. అప్పుడు కూడా కిషన్‌రెడ్డినే విజయం వరించింది. ఆ తరువాత జరిగిన రాజకీయ పరిణామాలతో ఆయన టీఆర్‌ఎస్‌లో చేరి.. ఆ పార్టీ అభ్యర్థిగా 2018లో బరిలో నిలబడ్డారు. కాంగ్రెస్ టికెట్ దక్కకపోవడంతో బీఎస్పీ నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి పోటీపడ్డారు. ఈ ఎన్నికల్లో కేవలం 356 ఓట్ల స్వల్ప మెజార్టీతో కిషన్‌రెడ్డి గట్టెక్కారు.

ఆనందంలో మల్‌రెడ్డి బ్రదర్స్

చిరకాల ప్రత్యర్థి అయిన కిషన్‌రెడ్డిపై ఈ ఎన్నికల్లో పై చేయి సాధించడంతో మల్‌రెడ్డి బ్రదర్స్‌లో ఆనందం వెల్లివిరిసింది. ఈ విజయం కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్‌ను నింపింది. 40,127 ఓట్ల మెజార్టీ సాధించి రంగారెడ్డి నియోజకవర్గంలో రికార్డు సాధించారు. గతంలో సత్యనారాయణ (టీడీపీ), కొండిగారి రాములు (సీపీఎం) అభ్యర్థులుగా 30 వేల మెజార్టీతో గెలుపొందారు.